ప్రజలందరి ఆరోగ్యమే 'సురక్ష' లక్ష్యం


రోగులకు సేవలు అందిస్తున్న వైద్యులు


బొగ్గులరోడ్డు - 2 సచివాలయంలో పౌష్టికాహార ప్రదర్శన ప్రారంభిస్తున్న జెడ్సీ రాము

• భీమిలి జోనల్ కమిషనర్ రాము

తగరపువలస: రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ, అదే సమయంలో ప్రైవేట్ ఆస్పత్రుల చుట్టూ తిరిగి డబ్బులు వృథా చేసుకోకుండా ఉండాలనే సదుద్దేశ్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని రాష్ట్రమంతా అమలు చేస్తున్నారని భీమిలి జెడ్సీ బి.రాము తెలిపారు. బొగ్గులరోడ్డు – 2 వార్డు సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో వైద్య పరీక్షల కోసం భీమిలి, విశాఖ, విజయనగరం వంటి పట్టణాల్లో వైద్యుల అపాయింట్‌మెంట్లు తీసుకుని పడిగాపులు కాసి సమయం, డబ్బులు ఖర్చు చేయాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి ఆలోచనతో సాధారణ, స్పెషలిస్ట్ వైద్యులు గ్రామాల బాట పట్టారన్నారు. ప్రతి ఒక్కరూ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. సచివాలయ సిబ్బంది చిట్టివలస, చిల్లపేట పరిధిలో 700 కుటుంబాలకు టోకెన్లు జారీ చేశారు. వైద్యులు ఏబీ మల్లికార్జునరావు, సుష్మిత, శతపతి కీర్తి, కల్యాణ్, చందుశ్రీ,, అనురాగ్, లావణ్యతోపాటు ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు వైద్య సేవలు అందించారు. వీరికి వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి, అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, సచివాలయాల కన్వీనర్ జగుపల్లి ప్రసాద్, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, వార్డు ప్రధాన కార్యదర్శి చిప్పాడ వెంకటేష్, జీరు సుజాత, నాయకులు బింగి హరికిరణ్‌రెడ్డి, అక్కరమాని గంగాధర్, సరగడ శివాంజనేయరెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి, సరగడ నాగిరెడ్డి, కంచుబోయిన వెంకటరావు, దల్లి అప్పలరెడ్డి, జీరు శ్రీనివాసరెడ్డి, చిల్ల సూరిబాబు, శిల్లా వంశీరెడ్డి, తెడ్లాపు అప్పలరాజు, చేట్ల నరసింగరావు తదితరులు సహాయ సహకారాలు అందించారు.

ఆనందపురం : మండలంలోని శొంఠ్యాంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. వైద్య శిబిరంలో 467 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. వారికి వైద్యులు పద్మ, రమేష్‌తోపాటు సిబ్బంది శిబిరంలో సేవలు అందించారు. ఏడు రకాల పరీక్షలు నిర్వహించి రోగ నిర్ధారణ చేశారు. శిబిరానికి వచ్చిన రోగుల్లో 32 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. మరో 13 మందికి వివిధ రకాల ఆపరేషన్లు అవసరమని గుర్తించి పెద్దాస్పత్రులకు రిఫర్ చేశారు. శిబిరానికి వచ్చిన వారి అవసరాలను బట్టి మందులు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి పద్మ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, లెంక రాంబాబు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, ఎంపీటీసీ సభ్యురాలు పల్లా దుర్గ, ఈవోపీఆర్డీ కె.రామారావు, నాయకులు కోరాడ వెంకటరమణారావు, గొలగాని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

931 మందికి వైద్య సేవలు

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది అమరావతి నగర్‌లోని బక్కన్నపాలెం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. జోనల్ కమిషనర్ కె.కనక మహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరం ద్వారా 931 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించామని తెలిపారు. 60 రకాల పరీక్షలు చేస్తున్నట్లు వైద్యాధికారి జి.సాల్మన్ రాజు చెప్పారు. చర్మ వైద్య నిపుణులు సాగరిక, పిల్లల వైద్య నిపుణులు ప్రవీణ్, కంటి వైద్య నిపుణులు కరిష్మా, దంత వైద్య నిపుణులు హర్ష, పీఎం పాలెం యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సుజనా సేవలు అందించారు.

నేడు రిక్షా కాలనీలో...

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం గురువారం రిక్షా కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సీఈవో సమీపంలో ఏర్పాటు చేస్తున్నట్లు వైద్యాధికారి గోశాల.సాల్మన్ రాజు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి వైద్య సేవలు అందిస్తామని, అంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


బొగ్గులరోడ్డు - 2 సచివాలయంలో చికిత్స కోసం నమోదు చేసుకుంటున్న వార్డు ప్రజలు


బక్కన్నపాలెం యూపీహెచ్‌సీలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం: జీవీఎంసీ 3వ వార్డు తోటవీధి సచివాలయం పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. 287 మంది రోగులకు ఆరుగురు వైద్య నిపుణులు పరీక్షలు చేసి అవసరమైన మందులు అందించారు. అనంతరం జెడ్సీ బొడ్డేపల్లి రాము మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు వైద్యం మరింత అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. కార్పొరేటర్ గంటా అప్పలకొండ, సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శి జయశంకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

'సురక్ష'ను సద్వినియోగం చేసుకోవాలి

పద్మనాభం: అందరూ జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు సూచించారు. మండలంలోని కోరాడలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్షను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందిన్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకొకసారి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రభుత్వం నిర్వహించనుందని తెలిపారు. ఈ సందర్భంగా వీరు ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను తిలకించారు. రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, నాయకులు కోండ్రోతు శ్రీనివాసరావు పాల్గొన్నారు.


కోరాడలో మందులు అందిస్తున్న ఎంపీపీ రాంబాబు, నాయకులు

'సురక్ష' శిబిరం నేడు

తగరపువలస: చిట్టివలస బంతాట మైదానంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు భీమిలి జెడ్సీ బి.రాము తెలిపారు. ఒకటో వార్డు సంతపేట సచివాలయానికి సంబంధించిన ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అందుబాటులోకి మెరుగైన వైద్యం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముందుచూపుతో వ్యవహరించి పాలనా దక్షతతో గ్రామీణులకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఇప్పటి వరకు నేను యూపీహెచ్‌సీకి వైద్యానికి వెళ్లేవాడిని. ప్రస్తుతం ఇంటి పక్కనే రక్తపోటు, మధుమేహం పరీక్షలు చేయించుకుని మందులు తీసుకున్నా. వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి.

– చిల్ల నరసింహులు, మాజీ కౌన్సిలర్

అవసరమైన మందులు ఇచ్చారు



నాలుగేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నా. చికిత్స కోసం వైజాగ్ వెళ్తే ఒక్కసారికి రూ.5 వేలు మందులకు ఖర్చవుతుంది. ఇప్పుడు మా ఊరిలోకే వైద్యులు వచ్చి రెండు రకాల మందులు ఇచ్చారు. దీంతో నాపై ఆర్థిక భారం తగ్గింది. అవసరమైతే కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లమని సిఫారసు చేశారు.

– నేదూరి అప్పలరెడ్డి, చిల్లపేట

ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రికి సిఫారసు



నాకు రెండు కళ్లు కనిపించేవి కాదు. గతంలో ఒక కంటికి శస్త్రచికిత్స చేయించుకున్నా. ప్రస్తుతం సచివాలయంలోని డాక్టర్లకు చూపిస్తే వెంకోజీపాలెంలోని ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రికి వెళ్లమని సిఫారసు చేశారు. ప్రభుత్వ ఖర్చులతోనే అక్కడ చికిత్స చేస్తామన్నారు.

– కిలిమి అప్పలనాయుడు, చిట్టివలస

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

భీమునిపట్నం: భీమిలి పరిసర ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ యు.సకరయ్య బుధవారం తెలిపారు. మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించే పనుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు భీమిలి చిన్నబజారు, కీతిన్‌పేట, బ్యాంకు కాలనీ, ఎలంపేట, మహాలక్ష్మిపురం, డెక్కతిపాలెం, రాజలింగంపేట, రాయపాలెం, మరడపాలెం, మామిడిపాలెం, మూలకుద్దు, శైలేంద్రరెడ్డి అపార్ట్‌మెంట్స్ ప్రాంతం, కె.నగరపాలెం, చేపలదిబ్బడిపాలెం, మంగమారిపేట, రామాద్రి తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

బాధితులకు సరకుల పంపిణీ


వేములయ్య కుటుంబానికి సరకులు అందిస్తున్న నాయకులు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు కొత్తపేటలో ఈ నెల 16న అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా నష్టపోయిన బవిరిశెట్టి వేములయ్య కుటుంబానికి వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం నిత్యావసర సరకులు, బియ్యం అందించారు. అక్కరమాని చినబాబు సాయంతో వీటిని బాధితులకు అందించారు. దుంప సాయిరెడ్డి, పందిరి విజయ్, వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సమావేశం నేడు

ఆనందపురం : పెద్దిపాలెంలోని చెన్నా కన్వెన్షన్ హాలులో వైఎస్సార్ సీపీ భీమిలి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం గురువారం మధ్యాహ్నం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం తెలిపారు. పార్టీ రీజినల్ కో – ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు హాజరు కానున్నారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పీసీబీ డిజైనింగ్‌పై వర్క్‌షాప్

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ట్రిపుల్ ఈ విభాగం ఆధ్వర్యంలో ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు డిజైనింగ్‌పై బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఎలక్ట్రానిక్ పరికరాలను ఏ విధంగా అనుసంధానించాలో టిక్ టాక్ సొల్యూషన్స్ డెవలపర్ కె.మల్లేష్ వివరించారు. ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ ఎ.అర్జునరావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కస్తుర్బా విద్యార్థినుల ప్రతిభ


కప్ అందుకుంటున్న కస్తుర్బా విద్యార్థినులు

భీమునిపట్నం: గుంటూరు జిల్లా మేడకొండూరులో రెండు రోజుల క్రితం జరిగిన రాష్ట్ర స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీల్లో భీమిలి కస్తూర్బా గాంధీ విద్యార్థినులు విజయం సాధించినట్టు ప్రిన్సిపాల్ గంగాకుమారి బుధవారం తెలిపారు. ఈ పోటీల్లో ఇక్కడి విద్యార్థినులు ప్రతిభ కనబరిచి గెలవడం విద్యాలయానికి ఎంతో గర్వకారణమని తెలిపారు. ఇదే స్ఫూర్తితో రాబోయే పోటీల్లో కూడా మంచి విజయాలు సాధించాలని, అందుకు అనుగుణంగా శిక్షణ అందిస్తామని తెలిపారు.

అందరూ ఓట్లు నమోదు చేసుకోవాలి


ఓటర్లుగా ఎలా నమోదు చేసుకోవాలో అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ మంజుల

భీమునిపట్నం: విద్యార్థులు కొత్త ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల సూచించారు. కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ ఆధ్వర్యంలో ఓటర్ల నమోదుపై బుధవారం అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వస్తుందన్నారు. ఎన్నికల్లో బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. అధ్యాపకలు డాక్టర్ ఎం.రమణ, పార్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం


పోలిపల్లి నారాయణమ్మకు ఆర్థిక సాయం అందిస్తున్న రామకృష్ణ స్నేహితులు

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలేనికి చెందిన పోలిపల్లి నారాయణమ్మకు స్థానికులు బుధవారం రూ.18 వేల ఆర్థిక సాయం అందించారు. ఇటీవల అనారోగ్యంతో నారాయణమ్మ భర్త రామకృష్ణ చనిపోవడంతో అతని స్నేహితులు ఈ సాయం అందించారు. ఇటీవల రామకృష్ణ వైద్యానికి స్నేహితులే దాతల సాయంతో రూ.1.30 లక్షలు అందించినట్లు తెలిపారు.

ప్రజా భాగస్వామ్యంతో డెంగ్యూ నియంత్రణ

మద్దిలపాలెం : డెంగ్యూ నియంత్రణకు మహానగర పాలక సంస్థ మలేరియా విభాగం ఆధ్వర్యంలో ఇంటింట సర్వే పక్కాగా నిర్వహించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి ఎం.తులసి ఆదేశించారు. జీవీఎంసీ 16వ వార్డు కేఆర్ఎం కాలనీలో సర్వే చేస్తున్న సిబ్బంది పనితీరును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా గృహాల్లోని ఫ్రిడ్జ్‌ల వెనుక నిల్వ నీరు తొలగించే ప్రక్రియను దగ్గరుండి పరిశీలించారు. అలాంటి నీటిలోనే లార్వా పెరుగుతుందని, దోమలు ఉత్పత్తి చెందుతాయని కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం జీవీఎంసీ, సచివాలయం, ఆరోగ్య సిబ్బంది నిర్వహించే డ్రై డే – ఫ్రై డే కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతోనే డెంగ్యూ నివారణ సాధ్యమవుతుందన్నారు. అనంతరం కాలనీలో నిర్మాణంలో వున్న భవంతుల వద్ద సంప్‌లను పరిశీలించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయిక్, ఆరోగ్య కార్యకర్తలు కె.ఎన్.శ్రీనివాసరెడ్డి, శేషుబాబు పాల్గొన్నారు.

కొమ్మాది విద్యుత్ శాఖ ఏఈగా నరేష్


ఏఈగా బాధ్యతలు స్వీకరించిన నరేష్‌ని సత్కరిస్తున్న సిబ్బంది

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డులోని కొమ్మాది విద్యుత్ సబ్ స్టేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా దుడ్డా నరేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సింహాచలం మీటర్స్ విభాగం నుంచి ఇక్కడకి ఆయన బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన నరేష్‌ను సిబ్బంది, స్థానికులు సత్కరించారు. ఇక్కడ పనిచేసిన సురేష్ పదోన్నతిపై సోంపేట బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ సబ్ స్టేషన్ పరిధిలో వినియోగదారులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందిస్తానన్నారు. నాణ్యమైన, నిరంతరాయమైన విద్యుత్ అందించడమే ధ్యేయంగా పనిచేస్తానని చెప్పారు.

ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలన


ప్రకృతి వ్యవసాయ పంట పరిశీలిస్తున్న అధికారులు

పద్మనాభం: మండలంలోని పొట్నూరులో సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పంటలను ప్రకృతి వ్యవసాయం రీజినల్ కో – ఆర్డినేటర్ ప్రకాశరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ఏటీఎం మోడల్‌లో 27 రకాల కూరగాయాలైన దంప జాతులు, తీగ జాతులు, బొప్పాయి, కరివేపాకు తదితరాలు పండించుకోవచ్చని తెలిపారు. ఒకేసారి పలు రకాల పంటలు సాగు చేయడం వల్ల తెగుళ్లు రాకుండా ఉంటాయన్నారు. ఆయనతోపాటు సిబ్బంది ఉన్నారు

రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు రామవీధిలో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీలకు వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మిన రామలక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కరమాని చినబాబు, పందిరి విజయ్, కొప్పల కృష్ణ, గిడుతూరి పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ధర్మ ప్రచార వారోత్సవాలు ప్రారంభం

తగరపువలస: సంగివలస పోలమాంబ అమ్మవారి ఆలయంలో బుధవారం నుంచి ధర్మప్రచార వారోత్సవాలను ఈవో ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో అర్చకుడు నరసింహమూర్తి, ఆలయ సిబ్బంది కోరాడ శ్రీను పాల్గొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 31న ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఈవో ప్రసాద్ తెలిపారు.

సంగివలస కాలనీలో అన్నదానం


అన్నదానం ప్రారంభిస్తున్న గురుభవానీ లక్ష్మీపతిరాజు

తగరపువలస: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 2వ వార్డు సంగివలస కాలనీలో 4 వేల మందికి బుధవారం అన్నదానం చేశారు. గురుభవానీ లక్ష్మీపతిరాజు బుధవారం నాటికి 303 రోజులు దీక్ష పూర్తి చేయడంతో కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. పలువురు భవానీలు, స్వాములు పాల్గొన్నారు.

శ్రీ మహాలక్ష్మీ నమోస్తుతే


ప్రత్యేక అలంకరణలో బబ్బేలమ్మ వారు


విశేష అలంకరణలో సిద్ధేశ్వరి మాత


చంద్రంపాలెంలో కమలాలతో పూజలందుకున్న అమ్మవారు

• కనులపండువగా శరన్నవరాత్రి ఉత్సవాలు

మధురవాడ: శరన్నవరాత్రి ఉత్సవాలు నాలుగో రోజు బుధవారం మధురవాడలోని వివిధ ప్రాంతాల్లో కనులపండువగా నిర్వహించారు. అమ్మవారిని భక్తులు శ్రీ మహాలక్ష్మిగా అలంకరించారు. చంద్రంపాలెం జాతర గట్టు శ్రీ దుర్గాలమ్మ ఆలయంలో అమ్మవారికి కలువ పూలతో ప్రత్యేక పూజలు చేశారు. చంద్రంపాలెంకి చెందిన పోతిన అప్పలరాజు, మల్లీశ్వరి దంపతుల సహకారంతో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. పట్నాల సుబ్బారావు, హరిశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు. జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెంలోని శ్రీ సాయి సూర్య రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో విశేషంగా అలంకరించి కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో కె.అప్పారావు, ధనుంజయ్, పట్నాయిక్ పాల్గొన్నారు.

సిద్ధేశ్వరి మాతకు విశేష అలంకరణ

మధురవాడ: మధురవాడ జంక్షన్‌లోని శ్రీ సిద్ధేశ్వర పీఠంలోని శ్రీ అన్నపూర్ణ దేవి సహిత సిద్ధేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారిని బుధవారం విశేషంగా అలంకరించారు. ఆలయంలో ప్రధాన అర్చకులు దూసి రామలింగ స్వామి ఆధ్వర్యంలో గాజులు, పువ్వులు తదితర సామగ్రితో శ్రీ మహాలక్ష్మిగా అలంకరించారు. భక్తులు విశేషంగా తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీ మహాలక్ష్మి అలంకరణలో బబ్బేలమ్మ

పీఎం పాలెం : భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న కారుషెడ్ బబ్బేలమ్మ ఆలయంలో శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శ్రీ మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు బుధవారం దర్శనమిచ్చారు. అలాగే శ్రీ శృంగేరీ శంకర మఠంలో కొలువు తీరిన శ్రీశారదాంబకు, బక్కన్నపాలెం రోడ్డులో ఉన్న దుర్గాలమ్మకు ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పూజల్లో పాల్గొన్నారు.


రేవళ్లపాలెంలో దుర్గా మాతకు పూజలు చేస్తున్న భక్తులు

పబ్లిక్ డిమాండ్

రోడ్డు మీదే భవన నిర్మాణ సామగ్రితో అవస్థలు


పీఎం పాలెంలో కాల్వలో వేసిన భవన నిర్మాణ సామగ్రి

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు పీఎం పాలెం ఆఖరి బస్టాప్ సిద్ధార్థ నగర్‌లో ఓ బిల్డర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్ కోసం ప్రభుత్వ రోడ్డు మీద, కాల్వల్లో సామగ్రి వేసేస్తున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవడంతోపాటు మురుగు నీరు ప్రవాహం కూడా సాధ్యం కావడం లేదు. కాల్వలో నిర్మాణ సామగ్రి వేయడంతో మురుగు నీరు నిలిచిపోయి దోమలు, ఈగలు వృద్ధి చెంది అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. బిల్డర్ దృష్టికి విషయం తీసుకెళ్తే... ఇష్టం వచ్చినచోట ఫిర్యాదు చేసుకోమంటున్నారు. ఈ విషయం జీవీఎంసీ జోనల్ అధికారులకు చెప్పినా ప్రయోజనం లేకపోయింది. కనీసం ఉన్నతాధికారులు అయినా తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలి.

– శ్రీనివాస్, పీఎం పాలెం.

నవోదయ విద్యార్థులకు ప్రధాని ప్రశంసలు

కొమ్మాది: పరీక్ష పే చర్చ కార్యక్రమంలో పాల్గొని సూచనలు చేసిన జవహర్ నవోదయ ఉపాధ్యాయులు, విద్యార్థులను ప్రధాని మోదీ ప్రశంసించారు. ఈ మేరకు ప్రధాని కార్యాలయం నుంచి ప్రశంసా పత్రాలు అందినట్లు విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ శ్రీపాద శరత్ చంద్ర కీర్తి తెలిపారు. విద్యార్థుల్లో నెలకొన్న ఒత్తిడి, భయాందోళనలను తొలగించేందుకు ప్రధాని మోదీ పరీక్ష పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఇందుల్లో పాల్గొని సూచనలందించిన 150 మంది విద్యార్థులు, 10 మంది టీచర్లను అభినందిస్తూ.. ప్రధాని సంతకంతో కూడిన పత్రాలు అందినట్లు వైస్ ప్రిన్సిపాల్ తెలిపారు. వీటిని బుధవారం ఉపాధ్యాయులకు అందించినట్లు చెప్పారు.

గెయిల్‌కు సాంకేతిక సహకారం

కొమ్మాది : భారత ప్రభుత్వ మహారత్న కంపెనీల్లో ఒకటైన గ్యాస్ అథారిటీ ఇండియా లిమిటెడ్ (గెయిల్) వివిధ ప్రాంతాల్లో ఉపయోగిస్తున్న గ్యాస్ పైప్‌లైన్లకు సంబంధించిన సాంకేతిక సహకారాన్ని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అభివృద్ధి చేసింది. ఇందుకు సంబంధించి నూతనంగా రూపొందించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని బుధవారం అధికారికంగా గెయిల్ సంస్థకు బదలాయించింది. కార్యక్రమంలో గెయిల్ విశాఖ – సికింద్రాబాద్ ఎల్‌పీజీ పైప్‌లైన్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎల్.ఎస్.రావు పాల్గొని సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన అధికారిక పత్రాలను గీతం రీసెర్చ్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు నుంచి స్వీకరించారు. ఈ సందర్భంగా ఎల్.ఎస్.రావు మాట్లాడుతూ తేమకు ఎదురైన సాంకేతిక సమస్యకు గీతం టెక్నాలజీ ఆఫీసర్ డాక్టర్ చంద్రమౌళి అతి తక్కువ సమయంలో పరిష్కారం చూపారని అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమయింది. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విశాలాక్షినగర్ దరి వైఎస్సార్ సీ వ్యూ పాయింట్ ఎదురుగా సీతకొండ అంచులో ఓ బండ రాయిపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు బుధవారం స్థానికుల నుంచి సమాచారం అందించింది. దీంతో పోలీసులు అక్కడకు వెళ్లి పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి కేజీహెచ్ మార్చురీకి తరలించినట్లు సీఐ సోమశేఖర్ తెలిపారు.